మ్యాచ్‌లో రోహిత్ కొడతాడు సిక్స్
కేసీఆర్ రంగంలో దిగితే విజయం ఫిక్స్
తెలంగాణలో పెరుగుతున్నది చలి
కేసీఆర్ దెబ్బ కు విపక్షాలు బలి
కార్యకర్తలే బీఆర్‌ఎస్ బలం
ప్రజలే కేసీఆర్ బలగం
కేటీఆర్‌ను చూసి కాంగ్రెస్ పరార్
బీఆర్‌ఎస్‌దే గెలుపు బరాబర్

- మాలోతు సురేష్

**91827 77222**

హ్యాట్రిక్ ఎలక్షన్- హ్యాట్రిక్ కేసీఆర్ కాన్సెప్ట్‌తో అసెంబ్లీ ఎన్నికల స్పెషల్ 'తెలంగాణ జైత్రయాత్ర'కు మీ నినాదాలు పంపాల్సిన వాట్సాప్ నెంబర్ ఇదీ.. మీ పేరు పంపడం మర్చిపోకండి.

## నాడు-నేడు

• ఒడ్డు చేరేదాకా గండం..



సానుభూతి... వానకాలం వస్తే ఏటూరునాగారం గ్రామాలకు ప్రజా ప్రతినిధులు వరదలా వచ్చేవారు. గోదావరి పోటెత్తినప్పుడు రోడ్డు మీది నీళ్లలో పడవ ప్రయాణం చేసే అక్కడి ప్రజలకు కనీసం తెడ్డులా కూడా అది పనికిరాలేదు. ములుగు జిల్లా రామన్నగూడెం-రాంనగర్ మధ్యలోని జీడివాగు వానకాలంలో ఉప్పొంగి ప్రవహించేది. దీంతో రాంనగర్, లంబాడీతండా గ్రామాలకు పూర్తిగా రాకపోకలు నిలిచి పోయేవి. వంతెన కట్టాల్సిన చోట బోటు ఏర్పాటు చేసి చేతులు దులుపుకున్నారప్పటి పాలకులు.

• వంతెనతో తీరింది కష్టం..



తెలంగాణలో ప్రజలకు అవసరమున్న ప్రతిచోటా వంతెనల నిర్మాణానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. వాగును దాటలేక, వైద్య సదుపాయాలు అందని దుస్థితిలో ఏ గ్రామమూ ఉండకూడదనేది సీఎం సంకల్పం. అందుకే జీడివాగు మీద రూ.4.5కోట్లతో హైలెవెల్ బ్రిడ్జిని కట్టించారు. 80 మీటర్ల పొడవుండే దీనికి ఇరువైపులా కాంక్రీట్ వాల్, అప్రోచ్ రోడ్లను వెడల్పు చేశారు. ఇప్పుడు ఇక్కడి గ్రామాల నుంచి పనికయినా, బడికయినా పదిలంగా పోతున్నారు జనం.

ద లీడర్..



# హరిత.. మనోహరం

### సమాజ హితం..'దాసరి' అభిమతం

### హరితమిత్రగా గుర్తింపు.. సామాజిక సేవలో ముందంజ

'మానవత్వ పరిమళం.. సమాజ హితమే ఆయన అభిమతం.. హరిత నియోజకవర్గమే లక్ష్యంగా ఇంటింటికీ అయిదు పండ్ల మొక్కలను అందజేసి సీఎం చేత శభాష్ అనిపించుకున్నారు. పేదింటి ఆడబిడ్డల పెండ్లిళ్లకు పుస్తె మట్టెలు అందజేసి పెద్దన్నగా నిలుస్తున్నారు. సొంత డబ్బులతో అంబులెన్స్‌ను కొని ఇచ్చారు. చిరువ్యాపారుల రక్షణకు గొడుగులు ఇచ్చి అందరివాడుగా ప్రజల గుండెల్లో సుస్థిర స్థానం సంపాదించుకున్నారు పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి..

తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించిన తర్వాత జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో పెద్దపల్లి ఎమ్మెల్యేగా రెండు సార్లు గెలుపొందారు మనోహర్‌రెడ్డి. ముఖ్యమంత్రి కేసీఆర్ పిలుపు మేరకు తన సొంత డబ్బులు రూ. కోటితో పెద్దపల్లి నియోజకవర్గంలోని ప్రతి ఇంటికీ 5 రకాల పండ్ల మొక్కలను అందజేశారు. ఆయన సేవలను గుర్తించిన ముఖ్యమంత్రి కేసీఆర్ మనోహర్‌రెడ్డిని హరితమిత్ర అవార్డుతో సత్కరించారు. పెద్దపల్లి నియోజకవర్గంలో ఇంటింటా పచ్చదనం వెల్లివిరియాలనే ఉద్దేశంతో కడియం, అశ్వారావుపేట, భీమారం, సంగారెడ్డిల నుంచి ప్రత్యేకంగా మొక్కలను తెప్పించి పంపిణీ చేశారు. ఇంటింటా దాసరి అందించిన పండ్ల మొక్కలు ఇప్పుడు ఫలాలను అందిస్తున్నాయి. ప్రజలకు ఇండ్లల్లోనే అంజీరా, బొప్పాయి. సపోటా, జామ, దానిమ్మ వంటి ఫలాలు అందుతున్నాయి. అవి ప్రజల ఆరోగ్యానికి గొప్ప వరంగా మారాయి. హరిత హారంలో భాగంగా తన సొంత డబ్బులను ఖర్చు చేసి సుల్తానాబాద్ మండలం ఐతరాజ్‌పల్లి గ్రామంలో మైసమ్మగుట్టపై పెద్దఎత్తున హరితహారం మొక్కలను నాటి హరిత ఎమ్మెల్యే అయ్యారు.




గిఫ్ట్ ఏ స్మైల్‌లో భాగంగా బహుమతిగా ఇచ్చిన అంబులెన్స్‌ను ప్రారంభిస్తున్న మంత్రి కేటీఆర్, ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి

### గిఫ్ట్ ఏ స్మైల్‌గా అంబులెన్స్..

మంత్రి కేటీఆర్ జన్మదినం సందర్భంగా పెద్దపల్లి నియోజకవర్గంలో అనేక సేవా కార్యక్రమాలు చేపట్టారు. 'గిఫ్ట్ ఏ స్మైల్'లో భాగంగా తన సొంత డబ్బులతో అంబులెన్స్‌ను అందజేశారు. పెద్దపల్లి పట్టణంలో వీధుల పక్కన చిరు వ్యాపారాలు చేసుకునే 150మందిని ఎండ, వాన నుంచి రక్షణ పొందడానికి గొడుగులను అందజేశారు. నియోజకవర్గంలో నిర్మించే ప్రతి ఆలయానికీ తన వంతు సహాయ సహకారాలు అందజేస్తున్నారు.

**ఆడబిడ్డల పెండ్లిళ్లకు పుస్తెమట్టెలు..**

పెద్దపల్లి ఎమ్మెల్యేగా దాసరి మనోహర్‌రెడ్డి పేదింటి ఆడబిడ్డల పెండ్లిళ్లకు పెద్దన్నగా సాయం అందిస్తున్నారు. పెండ్లిళ్లకు పుస్తెమట్టెలతో పాటు ఆర్థిక సాయం చేస్తున్నారు. బియ్యం, ఇతరత్రా పెండ్లి సామగ్రిని అందజేస్తున్నారు. పేదలు ఎవరైనా ఇండ్లు కట్టుకున్నా.. ఏ కష్టం వచ్చినా తానున్నానంటూ ముందుకు వస్తున్నారు. వారికి అండగా నిలుస్తున్నారు. సామాజిక సేవలో ముందుంటూ, నియోజకవర్గ ప్రజల మనసును గెలుచుకున్నారు.

# బోధన్ బాధలు తీరినయ్

### మూడుసార్లు గెలిచినా.. సుదర్శన్‌రెడ్డి చేసింది సున్నా • నీళ్ల మంత్రిగా.. నిజాంసాగర్ కాల్వలు బాగు చెయ్యలే

### ఎమ్మెల్యే షకీల్ హయాంలో చకచకా పనులు • బీఆర్‌ఎస్ పాలనలో ఆదర్శ నియోజకవర్గంగా బోధన్



బోధన్‌లోని నిజాంసాగర్ కాల్వల ఆధునీకరణతో డీ28 కాల్వలో సాగునీరు ఉధృతంగా ప్రవహిస్తున్న దృశ్యం

**బోధన్ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ నేత పొద్దుటూరి సుదర్శన్‌రెడ్డి మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలిచారు. పదిహేనేండ్లు అధికార పార్టీ ఎమ్మెల్యేగా కొనసాగారు. ఉమ్మడి రాష్ట్రానికి మంత్రిగా కూడా పనిచేశారు. ప్రజల ఓట్ల పుణ్యాన రాజకీయంగా ఎదిగిన ఆయన తన అభివృద్ధినే తప్ప, నియోజకవర్గ ప్రగతిని పట్టించుకున్న పాపాన పోలేదు. నీటి పారుదల శాఖ మంత్రిగా పని చేసినా.. బోధన్‌కు కనీసం తాగు, సాగు నీటిని అందించలేకపోయారు. ఆయన హయాంలో ఇక్కడి ప్రజలు నీటి కోసం అరిగోస పడ్డారు.**

**2014లో రాష్ట్రంలో కేసీఆర్ సర్కారు రావడం, బోధన్ ప్రజలు బీఆర్‌ఎస్ అభ్యర్థి మహ్మద్ షకీల్‌ను గెలిపించడంతో నియోజకవర్గానికి మంచి రోజులు మొదలయ్యాయి. దశాబ్దాల సమస్యలకు పరిష్కారం దొరుకుతున్నది. నిజాంసాగర్ కాల్వలను ఆధునీకరించారు. చెక్‌డ్యాంలను నిర్మించారు. చెరువులను బాగు చేయించారు. ఎత్తిపోతల పథకాలను పూర్తి చేయించారు. దీంతో నీటి కొరత తీరింది. ఈ ప్రాంతమంతా సస్యశ్యామలంగా మారింది. మౌలిక వసతులు మెరుగవుతున్నాయి.**

**2014కు** ముందు 60 ఏండ్ల పాటు బోధన్ నియోజకవర్గం అభివృద్ధికి దూరమయ్యింది. ఇక్కడి నుంచి 1999, 2004, 2009లో కాంగ్రెస్ తరపున పొద్దుటూరి సుదర్శన్‌రెడ్డి ఎమ్మెల్యేగా గెలిచారు. కాంగ్రెస్ హయాంలో మంత్రిగా పనిచేశారు. నీటి పారుదల శాఖ మంత్రిగా ఉండి నియోజకవర్గంలో కనీసం ఒక్క చెక్‌డ్యాంను కూడా పూర్తిస్థాయిలో నిర్మించలేదు. చెరువులు, కుంటలను బాగుచేయలేదు. చివరి ఆయకట్టును నిజాంసాగర్ నీళ్లతో ఒక్కసారి కూడా తడిపింది లేదు. అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేయడమే తప్ప, వాటిని పూర్తిచేయలేదు. సుదర్శన్‌రెడ్డికి తన వ్యాపారంపైన ఉన్న శ్రద్ధ ప్రజలపై లేకపోవడంతో నిత్యం సమస్యలతో సతమతమయ్యారనే విమర్శలు ఉన్నాయి. ఆయన పాలనతో విసిగిపోయిన బోధన్ ప్రజలు 2014 ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థి మహ్మద్ షకీల్‌ను ఎమ్మెల్యేగా గెలిపించారు.

### నిజాంసాగర్ కాల్వలకు ఊపిరి..

రాష్ట్రంలో కేసీఆర్ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో 2014 నుంచి షకీల్ సారథ్యంలో బోధన్ అభివృద్ధికి వేగంగా అడుగులు పడ్డాయి. కాంగ్రెస్ పాలకులు పట్టించుకోని నిజాంసాగర్ సాగునీటి సమస్యను షకీల్ పరిష్కరించారు. సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లి అధ్వానంగా ఉన్న నిజాంసాగర్ ఉప కాలువల(డిస్ట్రిబ్యూటరీ కాల్వలు)ను రూ.77 కోట్లతో ఆధునీకరించారు. దీంతో కాల్వల్లో నీళ్లు పరవళ్లు తొక్కుతున్నాయి. ఒకనాడు చుక్క నీటికి నోచుకోని చివరి ఆయకట్టు భూములు సైతం ఇప్పుడు సస్యశ్యామలంగా మారాయి. ఆరు చెక్‌డ్యాంలను పూర్తి చేయించారు. మూలన పడ్డ ఎత్తిపోతలకు ఊపిరి పోశారు. దీంతో ఇప్పుడు బోధన్‌లో సాగునీటి సమస్య తీరి, సస్యశ్యామలంగా మారింది.

### సుదర్శన్‌రెడ్డివి మాటలు.. షకీల్‌వి చేతలు..

**హామీలు** ఇచ్చి ఓట్లు వేయించుకోవడం, గెలిచాక శంకుస్థాపనలు చేసి వదిలేయడం వరకే సుదర్శన్‌రెడ్డి పరిమితమయ్యారు. అభివృద్ధి పనుల పురోగతిని పట్టించుకునే ఓపిక ఆయనకు ఉండేదికాదు. అందుకే ఆయన హయాంలో శంకుస్థాపనలు జరిగిన అనేక పనులు పెండింగ్‌లోనే ఉన్నాయి. నవీపేట్‌లోని పాలిటెక్నిక్ భవనం, బోధన్ – నిజామాబాద్ ప్రధాన రహదారి నిర్మాణమే ఇందుకు ఉదాహరణలు. షకీల్ ఎమ్మెల్యే అయిన రెండేండ్లలోనే రూ.6.5 కోట్లతో నవీపేట్‌లో పాలిటెక్నిక్ భవనం నిర్మాణం పూర్తయ్యింది. సుమారు రూ.30 కోట్లతో బోధన్ – నిజామాబాద్ ప్రధాన రహదారి విస్తరణ పనులు పూర్తి చేశారు. ఇలా సుదర్శన్‌రెడ్డి హయాంలో హామీలుగా మిగిలిపోయిన అనేక పనులను షకీల్ పూర్తి చేయించారు. తెలంగాణలోనే ప్రముఖ పుణ్యక్షేత్రాల్లో ఒకటైన బాసరకు వెళ్లేందుకు కాంగ్రెస్ హయాంలో సరైన రోడ్డు కూడా ఉండేది కాదు. షకీల్ ఈ విషయాన్ని సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లి రూ.55 కోట్లతో జాన్కంపేట్ – బాసర ఫోర్‌లేన్ రోడ్డును పూర్తి చేయించారు. దీంతో బాసరకు వెళ్లేందుకు రోడ్డు సదుపాయం మెరుగయ్యింది.

**షకీల్ చేసిన అభివృద్ధి**

- రూ.66.57 కోట్లతో మిషన్ భగీరథ ట్యాంకులు, పైప్‌లైన్ల నిర్మాణం.
- రూ.273.44 కోట్లతో 56 ఆర్ అండ్ బీ రోడ్ల అభివృద్ధి, విస్తరణ.
- రూ.200 కోట్లతో పంచాయతీరాజ్ బీటీ రోడ్లు, సీసీ రోడ్లు, వంతెనలు, కమ్యూనిటీ హాళ్లు తదితర అభివృద్ధి పనులు.
- రూ.300 కోట్లతో బోధన్‌లో ప్రభుత్వ జూనియర్, డిగ్రీ, పాలిటెక్నిక్ కళాశాలు, గురుకులాల భవనాల నిర్మాణం.
- రూ.141 కోట్లతో బోధన్ పట్టణంలో మౌలిక సదుపాయాల కల్పన. పట్టణ సుందరీకరణ.
- రూ. 82.45 కోట్లతో పల్లె, పట్టణ ప్రగతి పనులు, ట్రాన్స్‌ఫార్మర్లు, లైన్ల ఏర్పాటు.

**బోధన్ భళా**



బోధన్‌లోని మైనార్టీ బాలికల గురుకుల భవనం..

వినండహో..



# సామాన్యుడి భేరి

బీఆర్‌ఎస్‌కు స్టార్ క్యాంపెయినర్లు ఉండరు.. సామాన్య ప్రజలే ఆ పార్టీ తరఫున క్యాంపెయిన్ చేస్తారు. బీఆర్‌ఎస్‌కు రాష్ట్రమంతా తిరిగే ప్రచారక్‌ల అవసరం లేదు. సంక్షేమ ఫలాలు పొందిన పేదలే అంతా తామై ప్రచారం చేస్తారు. కార్యకర్తలే బీఆర్‌ఎస్ బలం.. ప్రజలే కేసీఆర్ బలగం. అలాంటి ఓ స్టార్ క్యాంపెయినరే ఈ బుడిగె జంగం బండలయ్య. 'కేసీఆరే గెలువాలి.. సారే రావాలి' అంటూ ఊరూరా తిరుగుతూ ప్రచారం చేస్తున్నారాయన. సైకిల్ పంక్చర్ దుకాణంలో పనిచేసి పొట్ట పోసుకుంటున్న ఈయనది దేవరకద్ర నియోజకవర్గం భూత్పూర్ మండలం ఎల్కిచర్ల గ్రామం. ఎండను సైతం లెక్క చేయకుండా ఓ చేత్తో సైకిల్‌ను పట్టుకొని.. మరో చేతిలో మైక్ పట్టుకొని మదిపట్ల గ్రామంలో వీధుల్లో తిరుగుతూ కనిపించారిలా.

ఫన్‌టాస్టిక్

# నేను కాను... ఎవర్నీ కానివ్వను!

**'కోమటిరెడ్డన్న దీర్ఘంగా ఆలోచిస్తున్నాడంటే ఈ ఎన్నికల్లో ఘన విజయం గురించే... అంతే కదా అన్నా?'**


'కాదు తమ్ముడు... ఒక్కొక్కణ్ని ఎలా ఓడించాలి అని ఆలోచిస్తున్నా?'

**'ఎవరినీ... మీ ప్రత్యర్థి పార్టీ వాళ్లనా అన్నా?'**

'కాదు మన సొంత పార్టీలో ప్రత్యర్థులను తమ్మీ ...'

**'అదేంటన్న ఇక్కడ నువ్వు మాత్రమే నామినేషన్ వేశావు. రెబల్ ఎవరూ లేరు కదా?'**

'హా .. హా .. మీకు తెలుసు కదా? జనం గెలిపించినా, ఓడించినా మునుగోడు గురించి నేను ఎప్పుడూ పెద్దగా ఆలోచించలేదు. జనం కూడా నా గురించి పెద్దగా ఆలోచించరు. నేను ఓడిస్తాను అన్నది సీఎం పోస్ట్ కోసం నాకు పోటీ వస్తున్న వాళ్లని'




**'అంటే 119 మందిని ఓడిస్తావా అన్న ? ప్రతి క్యాండిడేట్ సీఎం రేస్‌లో ఉన్నాడు కదా?'**

'హా.. హా .. భలే జోక్ వేస్తావు తమ్ముడు. అలా ఐనా 118 అనాలి. మనం ఒక సీటు సీపీఐకి వదిలేశాం కదా?'

**'ఏమనుకోకన్నా... నువ్వు ఒక్కడివే కోట్లు ఖర్చు చేసినా గెలవలేదు. 118 మందిని ఓడిస్తావా అన్న?'**

'గెలవడం కష్టం తమ్మీ... 18వేల కోట్ల రూపాయల కాంట్రాక్ట్ తీసుకుని బాగుపడ్డానని జనం ఓటు వేయలేదు. ఒకడు బాగుపడితే జనం తట్టుకోలేరు. అందుకే ఈసారి గెలుపు మీద కాదు, ఓడించడం మీద దృష్టి పెట్టాను. 118 మందిని కాదు. వీరిలో చాలా మంది తమంతట తామే ఓడిపోతారు. కానీ, సీఎం రేసులో ఉన్న ఒక్కొక్కడిని ఓడించి నా సత్తా చూపిస్తా. రేటెంత రెడ్డితో పాటు, సీతక్క, మధు అన్న వరకు అందరూ మేమే సీఎం అంటున్నారు. ఆ అందరినీ ఓడించే మాస్టర్ ప్లాన్ నా దగ్గర ఉంది. మునుగోడులో ఓడిపోయాను అని చిన్న చూపు చూస్తున్నారేమో... గెలిచే ప్లాన్ లేదు కానీ, ఓడించే ప్లాన్ ఉంది.'

'సరే సీఎం క్యాండిడేట్స్ అందరూ ఏం చేస్తున్నారో రహస్యంగా తెలుసుకొని వెంటనే నాకో రిపోర్ట్ ఇవ్వు.'

**'జానారెడ్డి గురించి కూడానా అన్నా?'**

'ఆయనేం చేస్తున్నాడో... ఏం మాట్లాడుతున్నాడో... ఆయనకే తెలియదు. ఇక మీరేం తెలుసుకుంటారు. రహస్యంగా కాదు బహిరంగంగా ఆయనే ప్లాన్ చెప్పినా అర్థం కాదు. రేస్‌లో ఆయన కూడా ఉన్నాడు కానీ, ఎన్నికల్లో పోటీ చేయడం లేదు కదా? ఆయన్ని వదిలేసి మిగిలిన సీఎం క్యాండిడేట్స్ వ్యూహం ఏమిటో వెంటనే రిపోర్ట్ ఇవ్వండి...'

*****

'అన్నా గెలుపు మనదే.'

**'మనం గెలుస్తున్నామా?'**

'కాదు .. సీఎం క్యాండిడేట్స్ అందరినీ ఓడించడమే మీ లక్ష్యం కదా? మిగిలిన వాళ్లంతా ఇదే పనిలో ఉన్నారు. వ్యూహాలు పన్నుతున్నారు.'

**'మన ప్లాన్ లీకైందా?'**

'కాదు. మన హస్తం డీఎన్‌ఏ మొదటి నుంచి అదే కదా? అయినా భయపడకండి. మీ అందరి కోరికా తీరుతుంది?'

**'అంటే ఆరు నెలలకు ఒకరం సీఎం అవుతామా?'**

'కాదు. మీ అందరి కోరికా తీర్చి జనం మిమ్మల్ని ఇంట్లో కూర్చోబెడతారు.'

▪ మురళి